సాక్షి తిరుపతి

గురువారం । 31 । జూలై । 2025



ఒక రైలు.. రెండు టికెట్లు

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే ప్రయాణికులు రెండుసార్లు తీసుకోవాల్సి వస్తుండడంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. - 8లో



అక్షరాంధ్ర లక్ష్యం

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులను చేయడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు. - 8లో



ఆగని గజరాజుల దాడులు

24 గంటలు కూడా దాటకనే చంద్రగిరి మండలంలో ఏనుగులు మరోమారు పంటలపై పడి దాడి చేసి బీభత్సం సృష్టించాయి. - 8లో

న్యూస్‌రీల్

అంతరిక్షంలో ఇస్రో అసామాన్య విజయాలు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని నిర్దీత కక్ష్యలోకి పంపడంలో ఘన విజయం సాధించినందుకు, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అధ్యక్షులు డా.వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, షార్ శాస్త్రవేత్తలు, ఇతర ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. జీఎస్ఎల్వీ ద్వారా మరో అత్యాధునిక ఉపగ్రహాన్ని నింగిలోకి పంపడం ద్వారా అంతరిక్ష రంగంలో అసమాన విజయం ఇస్రో సాధించడం దేశానికి గర్వ కారణమన్నారు. ఈ ప్రయోగం, అంతరిక్ష రంగంలో భారత్-అమెరికా దేశాల పరస్పర సహకారంలో ఒక మైలు రాయిగా నిలుస్తుందని అభివర్ణించారు.

బాధ్యతల స్వీకరణ



ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ

తిరుపతి లీగల్: తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక సెషన్స్ కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏ.అమరనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే ఆయనను ప్రభుత్వం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు



యోగిరాజు, శివకుమార్‌కు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

సైదాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటిస్తుండడంతో సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలకు పోలీసులు బుధవారం ముందస్తుగా నోటీసులు జారీచేశారు. సైదాపురం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు శివకుమార్, మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు యోగిరాజుతోపాటు పలువురికి నోటీసులు అందజేశారు. అందులో ''గతంలో జరిగిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనల్లో గొడవలు, తొక్కిసలాటలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆంక్షలు ఉన్నాయి.. దీంతో మీరు, మీ అనుచరులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలవడానికి వెళ్లకూడదు'' అని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,183 మంది స్వామివారిని దర్శించుకోగా 25,906 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జీవశాస్త్రంపై ఆసక్తి పెంచాలి



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: భవిష్యత్ తరాలకు జీవశాస్త్రంపై ఆసక్తి పెంచేందుకు అధ్యాపకులు, మేధావులు చొరవ చూపాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు సూచించారు. బుధవారం ఎస్వీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్, సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో జీవశాస్త్రం, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో భౌతిక, రసాయన శాస్త్రాల వంటి మూలశాస్త్రాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు కృషి చేయాలన్నారు. జీవశాస్త్రం వంటి కోర్సులను విద్యార్థులు ఆసక్తితో చదవాల్సిన అవసరం ఉందని, అందులో ప్రావీణ్యం సాధించిన అభ్యర్థులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ మలేషియాకి చెందిన సీనియర్ అధ్యాపకులు డాక్టర్ మన్సూర్ ఇస్మాయిల్ షేక్, ఎస్వీయూ అధ్యాపకులు డాక్టర్ పత్తిపాటి వివేక్, సభ్యులు డాక్టర్ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిసార్ గగన విహార్

షార్ కేంద్రం నుంచి 'నిసార్'.. జీఎస్ఎల్వీ ఎఫ్-16 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ గగన తలంలోకి విజయవంతంగా దూసుకెళ్లడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. దేశంలో మొట్టమొదటిసారి ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నిసార్ 102 ప్రయోగం విజయవంతంగా కక్ష్యలోకి దూసుకెళ్లడంతో జయహో భారత్ అంటూ షార్‌లోని గ్యాలరీ వీక్షకుల కరతాళధ్వనులతో హోరెత్తింది. శాస్త్రవేత్తలకు దేశం నలుమూలల నుంచి అభినందనలు మిన్నంటాయి.

ఇస్రో, నాసా సంయుక్త ప్రయోగం

- భూమి ఉపరితల పరిశీలన, వాతావరణ మార్పులపై అధ్యయనం
- విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన శాస్త్రవేత్తలు
- భారత్-అమెరికా దేశాల సహకారంలో ఇదో మైలురాయి
- గ్యాలరీలో వీక్షకుల కేరింతలతో సందడి

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్-16 ప్రయోగాన్ని బుధవారం సాయంత్రం 5.40 గంటలకు విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగాన్ని 18.40 నిమిషాల్లోనే ముగించి 2,392 కిలోలు బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. భూమి ఉపరితలం పరిశీలన, వాతావరణ మార్పులపై అధ్యయనం లాంటి వాటికి వినియోగించుకునేందుకు ఈ డ్యూయెల్ సింథటిక్ అపార్చర్ రాడార్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) మొదటిసారిగా కలిసిన చేసిన ప్రయోగం కావడం విశేషం. షార్ కేంద్రం నుంచి బుధవారం నిర్వహించిన జీఎస్ఎల్వీ ఎఫ్-16 ప్రయోగంతో జీఎస్ఎల్వీ సిరీస్‌లో 18 ప్రయోగాలను పూర్తి చేశారు. ఇస్రో ప్రయోగాల పరంపరలో ఎన్నో మైలురాళ్లు దాటినప్పటికీ వంద ప్రయోగాల మైలురాయిని దాటి 102 ప్రయోగాలను పూర్తి చేశారు.



నింగిలోకి దూసుకెళ్తున్న రాకెట్

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ ఎఫ్16 ప్రయోగం విజయవంతం కావడంతో ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇస్రో-నాసా కలిసి చేసి మొదటి ప్రయోగాన్ని విజయవంతం చేయడంతో ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు ఇతర శాస్త్రవేత్తలను అభినందించారు. ప్రపంచమే గర్వించదగిన రాకెట్ కేంద్రం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉండడం దేశానికి గర్వ కారణమన్నారు.

వీక్షకుల గ్యాలరీలో సందడి

తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్‌లో రెండో ప్రయోగవేదిక నుంచి బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగించిన జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల నుంచి సుమారు పది వేలమంది దాకా విచ్చేశారు. రాకెట్ ఎగురుతున్నంత సేపు జయహో భారత్... జయహో ఇస్రో... జయయో ఇస్రో అని నినాదాలు చేస్తూ జాతీయ జెండాను సగర్వంగా చూపించి సందడి చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట రోడ్డులో కార్లు, స్కూల్ వ్యాన్‌లు, బస్సులు బారులు తీరి కనిపించాయి. అయితే షార్ కేంద్రం వారు ప్రతి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గాలరీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే రాకెట్ నింగికేగుతున్న సమయంలో వీక్షకులు కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది.



శ్రీహరికోటలోని జీఎస్ఎల్వీ ఎఫ్-16 ప్రయోగాన్ని వీక్షిస్తున్న వేలాది మంది వీక్షకులు, విద్యార్థులు

జీఎస్ఎల్వీ ఎఫ్-16 ప్రయోగ తీరును పరిశీలిస్తే..

- జీఎస్ఎల్వీ ఎఫ్-16 రాకెట్‌కు మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 27.30 గంటల కౌంట్‌డౌన్ సమయంలో రాకెట్‌లోని లిక్విడ్ స్ట్రాపాన్ బూస్టర్లు, రెండో దశలో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రకియను చేపట్టారు. బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగాన్ని ప్రారంభించి 18.40 నిమిషాల్లో ప్రయోగాన్ని పూర్తి చేశారు.
- కౌంట్‌డౌన్ ముగిసిన వెంటనే 0.00 నిమిషాలకు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనం, రాకెట్‌కు చుట్టూరా ఉన్న నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లలో నింపిన 160 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి మొదటిదశను 152 సెకెండ్లకు పూర్తి చేశారు.
- మొదటి దశకు రెండో దశకు మధ్యలో రాకెట్ శిఖరభాగంలో ఉపగ్రహాన్ని అమర్చిన హీట్‌షీల్డ్ 171.8 సెకెండ్లకు విడిపోయాయి. రాకెట్‌లోని రెండోదశను 149.6 సెకెండ్లకు మండించి 284.1 సెకెండ్లకు పూర్తి చేశారు.
- రాకెట్‌లోని మూడోదశ అంటే క్రయోజనిక్ దశను 294.06 సెకెండ్లకు మండించి 1100 సెకెండ్లకు కటాఫ్ చేశారు.
- ఆ తరువాత 1120 సెకెండ్లకు (18.40 నిమిషాలు) 2,292 కిలోలు బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టి ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.



షార్ రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్-16 నింగి వైపు వెళ్లేందుకు మొదటిదశను మండిస్తున్న శాస్త్రవేత్తలు







మూడో దశలో రాకెట్ నిసార్ ఉపగ్రహంతో నిప్పులు చిమ్ముతూ నింగివైపుకు వెళ్తున్న దృశ్యం, నింగివైపు వేగంగా వెళ్తున్న దృశ్యం, మొదటిదశ పూర్తయి రెండోదశతో ప్రయాణిస్తున్న రాకెట్



క్రయోజనిక్ దశ మండుతూ ఉపగ్రహాన్ని కక్ష్య వైపు తీసుకెళ్తున్న దృశ్యం



రాకెట్లోని క్రయోజనిక్ దశ 2,392 కిలోల నిసార్ ఉపగ్రహాన్ని భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి విడిచి పెడుతున్న దృశ్యం



రిఫ్లెక్టర్ యాంటెన్నా విచ్చుకుని నింగిలో విహరిస్తున్న రాకెట్

'పీఎం వీబీఆర్‌వై'పై అవగాహన సదస్సు




సదస్సులో ప్రసంగిస్తున్న సతీష్‌కుమార్, వీరభద్రస్వామి, రవితేజరెడ్డి, హాజరైన హెచ్‌ఆర్‌లు

శ్రీసిటీ(సత్యవేడు): ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గర్ యోజన(పీఎం-వీబీఆర్‌వై)పథకంపై అవగాహన సదస్సు శ్రీసిటీలో బుధవారం నిర్వహించారు. యువతకు ఉపాధి లక్ష్యంగా ఎంప్లాయిమ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ ప్రోగ్రాం(ఈఎల్ఐ) అని పిలిచే ఈ పథకాన్ని కేంద్రప్రభుత్వం 2024 బడ్జెట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించింది. దీనిపై అవగాహన పెంచడం, సమర్థవంతంగా అమలు చేసేలా ప్రోత్సహించడం ఈ సదస్సు ఉద్దేశం. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ)కు చెందిన ఉన్నతాధికారులు, శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల హెచ్‌ఆర్ ప్రతినిధులు 60 మంది పాల్గొన్నారు. ఈపీఎఫ్ఓ అధికారులు పీఎం- వీబీఆర్‌వై పథకంపై సమగ్ర వివరణ ఇచ్చారు. ముఖ్యంగా తయారీరంగంలో భారీగా ఉద్యోగాల సృష్టి, కంపెనీ యాజమాన్యాలు, కొత్త ఉద్యోగులకు అందించే ఆర్థిక ప్రోత్సాహాల గురించి వివరించారు. ఉపాధిని ప్రోత్సహించడానికి రూపొందించిన వేతన-సంబంధిత ప్రోత్సాహాలను తప్పనిసరి ఈసీఎఫ్ఓ నమోదుపై వివరించారు. ఆధార్-ఆధారిత ప్రత్యక్ష బదిలీ వినియోగాన్ని వివరించారు. తయారీ రంగాల యాజమాన్యం కోసం రూపొందించిన ప్రత్యేక నిబంధనలు తెలిపారు. కేంద్ర పీఎఫ్ కమిషన్ (ఏపీ) వీరభద్రస్వామి, ప్రాంతీయ పీఎఫ్-1(కడప) రవితేజరెడ్డి, ప్రాంతీయ పీఎఫ్-2(తిరుపతి) సతీష్‌కుమార్, సీనియర్ ఈపీఎఫ్ఓ అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఓల నియామకం

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో పలు మండలాలకు ఎంఈఓలను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో దొరవారిసత్రం ఎంఈఓ-1గా సూళ్లూరుపేట ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కే.కొండయ్యను, కోట మండల ఎంఈఓ-1గా పెళ్లకూరు ప్రభుత్వ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ జి.శిరీషను, నాయుడుపేట ఎంఈఓ-1గా సత్యవేడు బాలుర ప్రభుత్వ పాఠశాలలో గ్రేడ్-2 హెచ్‌ఎం కే.మాధవీలత కల్యాణిని, పెళ్లకూరు ఎంఈఓ-1గా పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.వెంకటేశ్వర్లును, తడ ఎంఈఓ-1గా సత్యవేడు బాలుర హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కేజే వేములును, వాకాడు ఎంఈఓ-1గా సత్యవేడు బాలుర హైస్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆనందంను, వెంకటగిరి ఈఎంఓ-1గా పాకాల హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండయ్య నాయుడును నియమించారు.

యువతకు నైపుణ్య శిక్షణ కల్పించండి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లాలో యువతకు ఉపాధి కల్పించేందుకు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పరిశ్రమకు మద్దతు, ప్రోత్సాహకాలు ఇచ్చారా ? ఇండస్ట్రీ 4.0, డిజిటల్ తయారీ వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా తిరుపతి యువతకు ప్రత్యక్ష లాభాలు వచ్చేలా కేంద్రం ఎటువంటి ప్రణాళికలు రూపొందించారో చెప్పాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆధునిక సాంకేతిక రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణ కోసం కేంద్రబడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన ఇండస్ట్రీ 4.0 అమలు కోసం తీసుకుంటున్న చర్యలపై లోక్‌సభలో ప్రశ్నించారు. వీటికి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ సమాధానమిస్తూ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ప్రోగ్రాం కింద 2.79 లక్షలకు పైగా అభ్యర్థులను చేర్చుకుందన్నారు. ఈ కార్యక్రమం నాస్కామ్ సహకారంతో నడుస్తోందని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, త్రీడి ప్రింటింగ్, సైబర్ సెక్యూరిటీ మొదలైన అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యమన్నారు. ఇటీవల తిరుపతిలో ఏర్పాటైన నైలెట్ నైలెట్ కేంద్రంలో పైన పేర్కొన్న కోర్సులే కాకుండా పైథాన్ ప్రోగ్రామింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి కార్యక్రమాలను అందిస్తోందని తెలియజేశారు.

వైఎస్ జగన్ భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- నెల్లూరు పర్యటనలో ఏదైనా జరిగితే కూటమి ప్రభుత్వానిదే బాధ్యత
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జడ్ ప్లస్ కేటగిరీ సెక్యూరిటీ కల్పించాలి
- భూమన అభినయ్‌రెడ్డి డిమాండ్



వైఎస్ జగన్‌కు భద్రత పెంచాలంటూ నిరసన చేస్తున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష, పార్టీ శ్రేణులు

తిరుపతి మంగళం : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి చూపుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్ జగన్ పర్యటనల్లో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని జిల్లా పార్టీ కార్యాలయం వద్ద వందలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుని చరిత్రలో నిలిచిందన్నారు. అధికారం ఉన్నా.. లేకపోయినా జనాదరణ కలిగిన ఏకైక నాయకుడు జగనన్న అని..ఆయన్ను చూసేందుకు వచ్చే జనప్రవాహాన్ని చూసి తట్టుకోలేక సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ జనం రాకుండా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. జగనన్న పర్యటనలో కూటమి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా జన ప్రవాహాన్ని ఆపలేరన్నారు. జనాదరణ కలిగిన నాయకుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల చిత్తూరు జిల్లా బంగారుపాళెం మార్కెట్ యార్డ్‌లో రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన ఆయనకు భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందన్నారు. నెల్లూరు పర్యటనలో కూడా సరైన భద్రత కల్పించకుండా ఏదైనా జరగరాని సంఘటన జరిగితే అందుకు కూటమి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నెల్లూరులో ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులను, అభిమానులను నిర్బంధించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అన్నీఇన్నీ కావన్నారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డితో పాటు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

14 నెలల్లో 12,211 మంది చనిపోయారా?

- 14 నెలల కూటమి పాలనలో 12,211 పింఛన్ల కోత
- ఎందుకు తొలగించారని ప్రశ్నిస్తే.. చనిపోయారంటూ అధికారుల వింత సమాధానం
- రూ.15 వేలు, రూ.10 వేల పింఛన్ల పరిశీలన ఆగస్టు 10 నాటికి ముగింపు
- ఆగస్టు రెండో వారంలో విడుదల కానున్న తొలగింపు జాబితా

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెల ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల కోత కొనసాగుతూనే ఉంది. గత ఏడాది జూన్‌లో 2,71,183 మందికి పింఛన్లు అందించారు. ఈ ఏడాది ఆగస్టులో 2,58,972 మందికి పింఛన్లు ఇవ్వనున్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఈ 14 నెలలు కాలంలోనే ఇప్పటి వరకు 12,211 పింఛన్లను తగ్గించారు. పింఛన్ల సంఖ్య ఎందుకు తగ్గుతోందని డీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నిస్తే వారంతా మృతి చెందారని సమాధానం ఇస్తున్నారు. అంటే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ 14 నెలల్లో పింఛన్లు తీసుకుంటున్న వారు 12,211 మంది మృతి చెందారా ? అని అంతా చర్చించుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఎక్కడా అడుగులు పడలేదు. మరోవైపు వివిధ అనారోగ్య సమస్యలతో రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు పింఛన్ పొందుతున్న వారిని ఏడు నెలలుగా తనిఖీలు చేస్తున్నారు. ఇవి ఆగస్టు 10వ తేదీకి పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. అందులో తొలగించిన పింఛన్ల జాబితాను ఆగస్టు రెండో వారంలో వెల్లడిస్తారని సమాచారం. చిన్న చిన్న కారణాలను బూచిగా చూపి పింఛన్ తొలగిస్తే తాము ప్రాణాలతో జీవించలేమంటూ పలువురు వాపోతున్నారు. ఇంకోవైపు రూ.4 వేలు తీసుకునే వృద్ధుల పింఛన్లను సైతం ఆగస్టు మూడో వారం నుంచి తనిఖీలు చేస్తారని సమాచారం. మరి అప్పుడు ఎంతమందిని ఏరివేస్తారో అని లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయకుండా.. ఏళ్ల తరబడి తీసుకుంటున్న వారిని తొలగించేందుకు సిద్ధమైన కూటమి సర్కారుకు ప్రజాగ్రహం తప్పేలా లేదని పలువురు చెబుతున్నారు.

స్పౌజ్ పింఛన్లు 4,771 మంజూరు..

14 నెలలు తర్వాత ప్రభుత్వం స్పౌజ్(పింఛన్ తీసుకుంటూ భర్త మృతి చెందితే వారి భార్యకు ఇచ్చేవి)పింఛన్లు 4,771 మంజూరు చేసింది. వీరికి ఆగస్టు 1న అందించనున్నారు. అయితే భర్త పింఛన్ తీసుకోకుండా చనిపోయి వితంతువులైన వారికి పింఛన్ మంజూరుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో పలువురు వితంతువులు పింఛన్ కోసం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


రోడ్డుపై పడి ఉన్న సాహేరా భాను మృతదేహం

గూడూరురూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని గాంధీనగర్ సమీపంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీ 5వ వీధిలో ఓ మహిళ చనిపోయిందని స్థానికులు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించగా గూడూరు పట్టణంలోని నలజాలమ్మ వీధిలో నివాసం ఉంటున్న షేక్ సాహేరా భాను(33)తేలిందన్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. ఈ మేరకు గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి శవాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా పడి..


ఆటో బోల్తా పడడంతో గాయపడిన ప్రయాణికుడు


ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ కనికాచలం

తిరుపతి రూరల్ : జాతీయ రహదారిపై ప్యాసింజర్ ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందగా పలువురు ప్రయాణికులు గాయపడిన ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి రూరల్ గాంధీపురం పంచాయతీ పరిధిలోని బాలాజీ డెయిరీ సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై చంద్రగిరి నుంచి తిరుపతి వైపునకు వెళ్లే ప్యాసింజర్ ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పాతకాల్వకు చెందిన డ్రైవర్ కనికాచలం (50) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే గాజుల మండ్యంకు చెందిన రామయ్యకు తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్త వల్లే బోల్తా పడినట్లు పోలీసులు గుర్తించారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక రైలు.. రెండు టికెట్లు

- తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో జర్నీ ఇక్కట్లు
- గుంతకల్లుకు వెళ్లేటప్పుడు కడపలో ప్యాసింజర్ టికెట్ కొనాలి
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



విశాఖ–తిరుపతి–కడప (తిరుమల) ఎక్స్‌ప్రెస్ రైలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: రైలు ఒక్కటే.. కానీ అందులో ప్రయాణించాలంటే మాత్రం రెండు టికెట్లు కొనాలంట.. ఇదీ తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేయాలంటే నిబంధన. విశాఖ–తిరుపతి–కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను నెల రోజుల కిందట గుంతకల్లు జంక్షన్ వరకు పొడిగించారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఈ పొడిగింపు ప్రక్రియ విధానంలో రైల్వే అధికారులు మార్పులు చేశారు. ఇదేమిటంటే కడప నుంచి గుంతకల్లు వరకు ప్రత్యేక ప్యాసింజర్ రైలుగా మార్చారు. ప్రయాణ టికెట్ విషయంలో మాత్రం గజిబిజి విధానాన్ని అమలు చేశారు. కడప–గుంతకల్లు మధ్య మాత్రం ప్యాసింజర్ (జనరల్) టికెట్ తీసుకోవాలి. అయితే గుంతకల్లు వైపు నుంచి తిరుపతికి రావాలంటే కడపలో దిగి, అక్కడి నుంచి ఎక్స్‌ప్రెస్ టికెట్ కొనాలని నిబంధన పెట్టారు. కాకపోతే కడపలో ట్రైన్ అరగంట ఆగుతుంది.

చాలామందికి విషయమే తెలియదు..

జనరల్ టికెట్లు తీసుకున్న ప్రయాణికులు గుంతకల్లు–కడప మధ్య జనరల్ బోగీలతో పాటు స్లీపర్‌లో సైతం ప్రయాణించడానికి మాత్రం వెసులుబాటు కల్పించారు. ఈ రైలు గుంతకల్లు నుంచి తిరుపతికి కడప మీదుగా వెళ్తుందనే విషయం చాలావరకు ప్రయాణికులకు తెలియడం లేదు. ఈ విషయం సూచించే విధంగా బోర్డులో మార్పులు, చేర్పులు లేకపోవడంతో తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ఇదే విషయాన్ని కొందరు ప్రయాణికులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టికెట్లను కొనుగోలు చేసే విషయంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారనే హామీలు ఇస్తున్నారు. ప్రస్తుతం రైలును గుంతకల్లు వరకు పొడిగించి పరీక్షిస్తున్నామని, త్వరలో రైలు నేమ్‌బోర్డులో మార్పులు చేస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు.

ప్రయాణికులకు తప్పని కష్టాలు..

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణంలో ప్యాసింజర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గమ్యస్థానం చేరుకోవడానికి ఒకే రైల్లోనే రెండు టికెట్లు కొనాల్సి రావడం సినిమా కష్టాలను తలపిస్తోంది. గతంలో తిరుమల ఎక్స్‌ప్రెస్ కడప నుంచి తిరుపతి, విశాఖ మీదుగా కొర్బా వెళ్లేది. తిరుపతి నుంచి వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం గుంతకల్లు వరకు పొడిగించారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించండి

- ప్రతిసారి జరిమానాలు వేయడం కాదు.. లైసెన్స్ రద్దు చేస్తాం
- ఆహార సంబంధిత కేసుల విచారణ సందర్భంగా జేసీ శుభం బన్సల్


శుభం బన్సల్, జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: ఆహార సంబంధిత షాపులు, దుకాణాలు, హోటళ్లు తదితర వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఆహార సంబంధిత పాత కేసులను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. ఆహార భద్రతాధికారుల ఆధ్వర్యంలో వ్యాపారులను కలెక్టరేట్‌లో సమావేశపరిచారు. ఆ మేరకు జేసీ విచారణ అనంతరం ఆయన ఆహార ప్రమాణాలను పాటించని పలువురు వ్యాపారులకు జరిమానా విధించారు. ప్రధానంగా తిరుపతిలోని ఓ ఐస్‌క్రీమ్ ఏజెన్సీ షాపునకు రూ.50 వేలు, రెస్టారెంట్, దాబాలు, హోటళ్లకు రూ.1.15 లక్షలు, సరైన లేబుల్ వివరాలు లేకుండా వాటర్ బాటిల్స్ విక్రయిస్తున్న ఓ వ్యాపారికి రూ.30 వేలు, ఓ రెసిడెన్షియల్ విద్యాసంస్థకు రూ.30 వేలు, నాణ్యతలేని నెయ్యి విక్రయించిన వ్యాపారికి రూ.15 వేలు, బేకరీ నిర్వాహకుడికి రూ.10వేలు, వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా వివిధ ఆయిల్ స్టాల్స్ ప్యాకెట్లు ముద్రించిన వారికి రూ.2 లక్షలు, ఓ వ్యాపారి కాలపరిమితికి మించిన ఆహార పదార్థాలను దుకాణంలో ఉంచినందుకు రూ.15వేలు జరిమాన విధించారు. మొత్తంగా 20కేసులకు సంబంధించి 4,92,000 జరిమాన వేశారు. ఇకపై వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను పాటించడంతోపాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పొందిన తర్వాతే వ్యాపారం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతిసారి జరిమానాతో సరిపెట్టడం కుదరదని.. మరోసారి ఇలా చేస్తే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

హోరాహోరీగా ముగిసిన క్రికెట్ పోటీలు



అండర్–14 విభాగంలో విజేతగా నిలిచిన లిటిల్ ఏంజెల్స్ స్కూల్ టీం



అండర్–17 విభాగంలో విజేతగా నిలిచిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : తుమ్మలగుంట క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన అండర్–14, 17 జిల్లాస్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు రెండు విభాగాల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన 14 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అండర్–14 విభాగంలో లిటిల్ ఏంజెల్స్ పాఠశాల జట్టు విజేతగా నిలువగా, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు రన్నరప్‌గా, సోక్రటీస్, నాగార్జున పబ్లిక్ స్కూల్ జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే అండర్–17 విభాగంలో ఇంటర్ నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు విజేతగా, రెయిన్‌బో స్కూల్ టీం రన్నరప్‌గా, జీఎస్ఆర్ మాగ్నటిక్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్స్ జట్లు తృతీయ స్థానం సాధించాయి. గెలుపొందిన జట్లకు, బెస్ట్ క్రికెటర్లకు లక్ష్మీ చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ కొప్పర్ల దివాకర్ చేతుల మీదుగా ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో టెన్నీస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.దేవరాజ్, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి కె.హేమంత్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆగని గజరాజుల దాడులు



పంటపొలాల్లో బీభత్సం సృష్టిస్తున్న ఏనుగులు

- నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంట పొలాలపై దాడి
- 24 గంటల గడవక ముందే మరోసారి బీభత్సం
- లబోదిబోమంటున్న రైతన్నలు

చంద్రగిరి: పంట పొలాలపై గజరాజుల దాడులు ఆగడం లేదు. 24 గంటలు గడవకముందే మరోసారి పంట పొలాలపై ఏనుగులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రైతుల వివరాల మేరకు.. మంగళవారం తెల్లవారుజామున ఏనుగుల మంద నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంట పొలాలపై దాడులకు తెగబడ్డాయి. అక్కడ నుంచి రూటు మార్చి శ్రీవారిమెట్టు కాలినడక మార్గం వైపు వెళ్లాయి. దీంతో టీటీడీ విజిలెన్స్, అటవీ అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతంలోకి దారి మళ్లించారు. అయితే అర్ధరాత్రి సమయంలో సుమారు 13 ఏనుగులు నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంట పొలాల్లోకి చొరబడి బీభత్సం సృష్టించాయి. వరి పంటను పూర్తిగా నాశనం చేయడంతో పాటు అరటి చెట్లను ధ్వంసం చేశాయి. అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు ఏనుగులు తిష్ట వేయడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని బాణసంచాలు పేల్చుతూ, డప్పులు వాయిస్తూ అడవిలోకి తరిమేందుకు ప్రయత్నించారు. అయితే ఏనుగులతో పాటు గున్న ఏనుగులు ఉండడంతో అవి అక్కడ నుంచి కదలకపోవడంతో వారు చేసేదేమీ లేక వెనుదిరిగారు. ఆపై ఉదయం ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్లిపోయినట్లు రైతులు తెలిపారు.

పంట చేతికొచ్చే సమయంలో ఇలా..

ఆరుగాలం కష్టపడి పండించిన వరి, అరటి పంటలను ఏనుగులు నాశనం చేస్తున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు వచ్చినట్లు అటవీ అధికారులకు సమాచారం అందిస్తే, సిబ్బంది మాత్రమే వచ్చి.. నామమాత్రంగా బాణసంచా పేల్చారన్నారు. అయితే ఏనుగులు వెనుదిరగకపోవడంతో తామేమీ చేయలేమని వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో నెలన్నర రోజుల్లో పంట చేతికొస్తుందనుకునే లోపు ఏనుగుల దాడులతో కన్నీళ్లు మిగిలుతున్నాయని వాపోయారు.

ముగిసిన రెండవ విడత వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్ ప్రవేశాలలో భాగంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు కొనసాగిన వెబ్‌ఆప్షన్ల రెండవ విడత ప్రక్రియ బుధవారంతోముగిసింది.శుక్రవారం వెబ్‌ఆప్షన్ల మార్పుకు అవకాశం ఇస్తూ 4వ తేదీన రెండవ విడత సీట్ల కేటాయింపు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ బదిలీలతో మార్పు అసాధ్యం మేడమ్

- అందరినీ బదిలీ చేస్తేనే ప్రక్షాళన చేసినట్లు అవుతుంది
- పదోన్నతి పొందిన వ్యక్తి..కింద పోస్టులో తిష్ట వేయడం మన కార్పొరేషన్‌లోనే సాధ్యం
- కమిషనర్‌కు ఓ అధికారి బహిరంగ లేఖ


నగరపాలక సంస్థ కార్యాలయం


కార్యాలయంలోని రెవెన్యూ ఆఫీసర్ చాంబర్

తిరుపతి తుడా: ''తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన చేయాలని మీరు కంకణం కట్టుకున్నారు.. నాలుగైదేళ్లుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఉద్యోగులను మాత్రమే బదిలీ చేశారు..అదే శాఖలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఓ అధికారిని మాత్రం కదిలించలేకపోయారు.. ఆ శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలంటే రెవెన్యూ ఆఫీసర్ నుంచి గుమస్తా వరకు బదిలీ చేస్తేనే మీరు అనుకున్న లక్ష్యానికి అర్థం ఉంటుంది.. అలాకాకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఏళ్ల తరబడి తిష్ట వేసిన వ్యక్తిని బదిలీ చేయకుండా కిందిస్థాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసినంత మాత్రాన ఆ శాఖ ప్రక్షాళన జరిగినట్టు కాదన్న విషయం మీ దృష్టికి తీసుకొస్తున్నా'' అంటూ ఓ అధికారి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్యకు బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. అలాగే ఆ లేఖను చీఫ్ సెక్రటరీ, పురపాలక శాఖ మంత్రికి, మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీలకు పంపించారు. ఇంకా ఆ లేఖలో.. 'కమిషనర్‌గా మీరు బాధ్యతలు తీసుకున్న వెంటనే ప్రక్షాళన చేయాలని భావించారు.. మార్పు తీసుకురావాలన్న మీ ఆలోచన మంచిదని అందరూ భావించారు.. ఉద్యోగులు కూడా అందరికీ సమన్యాయం దక్కుతుందని సంతోషపడ్డారు. కానీ ఆ స్థాయిలో ప్రక్షాళన జరగకపోగా 15 ఏళ్లకు పైగా ఒకే పోస్టులో ఉన్న అధికారిని మీరు కదిలించకపోవడం ఉద్యోగులందరి నమ్మకాన్ని దెబ్బతీసింది' అంటూ ఆయన ఆవేదన వెళ్లగక్కారు.

మరొకరికి అవకాశం ఇవ్వరా?

సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది చాలామంది ఉద్యోగులు కార్యాలయంలోని అన్ని పోస్టుల్లోనూ పనిచేయాలని భావిస్తున్నారని.. రిటైర్ అయ్యే లోపు రెవెన్యూ ఆఫీసర్‌గా.. మేనేజర్‌గా పని చేయాలనే కోరిక ఉంటుందని లేఖలో వివరించారు. 15 ఏళ్లుగా రెవెన్యూ ఆఫీసర్‌గా ఒకే వ్యక్తి కొనసాగడం వల్ల అనేకమంది ఉద్యోగులు ఆ పోస్టులో పని చేయకుండానే రిటైర్డ్ అయిపోయారన్నారు. అతి తక్కువ కాలంలో మరి కొందరు రిటైర్ అయ్యేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. సీనియర్లకు ముఖ్యమైన పోస్టుల్లో పనిచేసే అవకాశాన్ని ఇవ్వండి.. మేనేజర్‌గా పదోన్నతి పొందిన రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవను ఆ పోస్టులోకి పంపించి, మరో సీనియర్ సూపరింటెండెంట్‌కు ఆర్ఓగా అవకాశం కల్పించాల్సిన బాధ్యత మీపై ఉంది మేడమ్ అని కోరారు. ప్రస్తుతం ఈ లేఖ తీవ్ర దుమారం రేగడంతో పాటు చర్చనీయాంశంగా మారింది.

నేషనల్ హైవే భూ సర్వే


సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, అధికారులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో ఉన్న తిరుపతి–చెన్నై నేషనల్ హైవేకు సంబంధించి బుధవారం రెవెన్యూ అధికారులు, హైవే అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. నేషనల్ హైవే భూ సేకరణలో భాగంగా గ్రామంలో 200 అడుగుల వెడల్పు ప్రకారం గతంలో సర్వే నిర్వహించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించారు. కొందరు నష్టపరిహారం తీసుకున్నప్పటికీ ఆ స్థలాన్ని వదులుకోలేదు. దీంతో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వే చేసి రెండు రోజుల్లో స్థలాలు ఖాళీ చేసి, హైవే అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామ పెద్దలతో కృష్ణ మందిరం, సాయిబాబా మందిరం తొలగింపుపై చర్చించారు. దేవాలయాలను మరొకచోటకి మార్చేందుకు సమ్మతించారు.

డీ అడిక్షన్ సెంటర్ల నిర్మాణం అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ నాయక్

తిరుపతి తుడా: మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి బయట పడడానికి ప్రధాన చికిత్స అయిన డీ అడిక్షన్ సెంటర్ల నిర్మాణం అవసరమని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు.జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన వైద్యులు, ఎన్‌జీఓల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యసనం అనేది ఒక తీవ్రమైన సమస్య అని ఇది ఒక వ్యక్తి మెదడు, ప్రవర్తనను ప్రభావితం చేసే వ్యాధి అని తెలిపారు. మద్యపానం, గంజాయి, కొకైన్, నికోటిన్ వంటి మాదక ద్రవ్యాలు మెదడు పై ప్రభావం చూపి స్వీయ నియంత్రణను బలహీన పరుస్తుందని అన్నారు. ఇలాంటి సమస్య నుంచి బయటపడాలంటే మెడికల్ కేర్, సైకాలజికల్ ట్రీట్‌మెంట్ అవసరమని, ఆ దిశగా బాధితులను ప్రోత్సహించాలని తెలిపారు. సమావేశంలో డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావ్, ఏఓ డాక్టర్ మురళి కృష్ణ, సీతారామ్ నాయుడు, అధికారులు, వైద్యులు, రాస్, పాస్ ఎన్జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్


ఎన్‌బీఏ గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న ఈఓ

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 2028వ సంవత్సరం వరకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితో నేషనల్ బోర్డ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించిందన్నారు. గత నెలలో న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలలోని ప్రయోగశాలలు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, రికార్డులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కళాశాలలో బోధన, ల్యాబ్స్, లైబ్రరీ తదితర అంశాలపై విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించారు. నేషనల్ బోర్డ్ నిబంధనల మేరకు పాలిటెక్నిక్ కళాశాలను నిర్వహిస్తుండడంతో ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్


పట్టుబడిన సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: రాత్రి పూట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పుత్తూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పుత్తూరు డీఎస్పీ రవి కుమార్, పుత్తూరు సీఐ ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకున్నారు. రెండు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కేసులున్న తమిళనాడుకు చెందిన మనీ అలియాస్ కోవిల్ మనీ (38), సురేష్ అలియాస్ గుణ(35), తిరుపతి మంగళంకు చెందిన కుమార్(29), మణికంఠ(25), పట్టుబడ్డారు. ఈ కేసులో తమిళనాడుకు చెందిన ప్రభు(26), మణిగండన్(47) ఇద్దరు పరారీలో ఉన్నారని వివరించారు. వీరంతా పలుమార్లు జైలు కెళ్లి జైల్లో పరిచయాల వల్ల ముఠాగా ఏర్పడ్డాయని చెప్పారు. వీరి నుంచి 190 గ్రాముల బంగారు, 2.3 కిలోల వెండి ఆభరణాలను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ సుమారు రూ.20.4లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసును ఛేదించడంలో పుత్తూరు పోలీసులు ఎంతగానో కృషి చేశారన్నారు. నిందితులందరిపై షీట్ ఓపెన్ చేస్తామన్నారు.

తమ్ముళ్లు..పెద్ద భూమాయగాళ్లు

- కలువాయి మండలంలో 10 ఎకరాల భూకబ్జా
- అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించి మరీ ఆక్రమణ
- భూకబ్జాలతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు


10 ఎకరాల భూమిని ఆక్రమించి చదును చేసిన టీడీపీ నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి భూములు కొల్లగొట్టడంలో తెలుగు తమ్ముళ్లు తలమునకలయ్యారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో 130 ఎకరాల్లో పది ఎకరాలను భూకబ్జా చేయడం బుధవారం వెలుగు చూసింది. ఆ గ్రామ ప్రజలు అందించిన వివరాల మేరకు.. కలువాయి మండలం తెలుగురాయపురంలో 582, 586, 590, 593, 576, 577, 578 తదితర సర్వే నంబర్లలో సుమారు 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని కాజేందుకు కూటమి నేతలు పలు రకాల కుట్రలు పన్నారు. గత ఏప్రిల్ 25న సాక్షిలో 'బాబాయ్.. భూచోల్లు' అనే కథనం కూడా ప్రచురితం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆ భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు.

హెచ్చరిక బోర్డులను తొలగించి ఆక్రమణ

ఈనేపథ్యంలో మే7న మళ్లీ ఆ భూముల్లో ఉన్న హెచ్చరిక బోర్డులను తొలగించి ఇటాచీ వాహనంతో భూమిని చదును చేసేందుకు తమ్ముళ్లు రంగం సిద్ధం చేశారు. మే 8న తెలుగురాయపురం సర్పంచ్ రమణమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు బి.నారాయణరెడ్డితో పాటు మరో 150 మంది గ్రామస్తులంతా ఐకమత్యంగా కలిసి చదును చేస్తున్న భూముల వద్దకు వెళ్లడంతో అక్కడి నుంచి చిత్తగించారు. తాజాగా తెలుగురాయపురం, తోపుగుంట అగ్రహారానికి చెందిన మరో ఇద్దరు నేతలు కలసి దర్జాగా 10 ఎకరాల భూమిని చదును చేసుకున్న విషయం బుధవారం వెలుగుచూసింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అక్షరాస్యతే 'ఉల్లాస్ అక్షరాంధ్ర' లక్ష్యం

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు


శిక్షణకు హాజరైన మండల స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది

తిరుపతి రూరల్ : నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ''ఉల్లాస్ అక్షరాంధ్ర'' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి అక్షరాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2023లో నిర్వహించిన సర్వే ద్వారా జిల్లాలో గుర్తించిన 88,687 మంది వయోజనులైన నిరక్షరాసులను అక్షరాస్యులుగా చేయడానికి డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ మహమ్మద్ ఆజాద్ మాట్లాడుతూ జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌లో 67,170 మందిని డీఆర్‌డీఏకి, 7,280 మందిని డ్వామాకు, 14,237 మందిని మెప్మాకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. అభ్యసన పూర్తయిన తరువాత అభ్యాసకులందరికీ 2026 మార్చిలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమం విజయ వంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఎంపీడీఓ రామచంద్ర, ఏపీఎంలు, ఏపీవోలు పాల్గొన్నారు.